

తలసేమియా చంపేస్తోంది..!

ఉమ్మడి జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం రెండు వేల మందికి పైగా బాధితులు ఉన్నారు. 10లో



కష్టపడ్డ వారికి గుర్తింపేది?

కష్టపడ్డ వారికి పార్టీలో తగిన గుర్తింపు దక్కడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు ఇచ్చోడలో కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించారు. 11లో



వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గనున్నాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూభారతితో సమస్యలు పరిష్కారం



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

సాత్నాల: భూభారతి చట్టం ద్వారా రైతుల భూసమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భోరజ్ మండలంలోని బాలాపూర్‌లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గణేశ్‌పూర్ శివారులోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం ద్వారా రైతులకు వేగవంతంగా నాణ్యమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి వివరాలను సంబంధిత అధికారులకు పంపి క్షేత్రస్థాయిలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా మరోసారి జాబితాలు పరిశీలించాలన్నారు. అనంతరం గణేశ్‌పూర్ శివారులోని సర్వేనంబర్-1లో కాస్తు, సాదాబైనామాలో పట్టాకోసం వచ్చిన దరఖాస్తులను, స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ రఘునాథ్‌రావ్, ఏఈ, డీటీ పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపట్టాలి

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, అధికారులతో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. ఆయన వెంట జెడ్పీసీఈవో జితేందర్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ ఉన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి

గుడిహత్నూర్: ఆదివాసీ సంస్కృతిని భావితరాలకు అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని శంభుగూడలో కొద్ది రోజులుగా ఆదివాసీ సకల కళా వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ కాత్లే శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గుస్సాడీ, ఇతర ఆదివాసీ కళల శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఇందులో ఎస్పీ అఖిల్ మహాజన్, డీటీ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో అబ్దుల్ హై, ఆర్‌ఐ అరుణ్, గ్రామ మాజీ సర్పంచ్ శంభు, ఆదివాసీ సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. వంట గదితో పాటు పలు వార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలో శుభ్రత లోపించిందని గుర్తించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆర్‌ఎంవో సాయి ప్రసన్న రెడ్డి తదితరులున్నారు.

అందుబాటులో 7లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో 203 విత్తన దుకాణాల్లో 7లక్షల 3వేల 653 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు విధిగా రశీదు తీసుకోవాలని సూచించారు. అన్ని మండలాల్లో హై బ్రిడ్ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

ఆదిలాబాద్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి సచిన్, టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి తనీష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, ఐఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షుడు నర్సింగ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి, పాల్గొన్నారు.

ఇచ్చోడ సీఐ బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడ సీఐగా పనిచేస్తున్న భీమేష్ రామగుండంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో పనిచేస్తున్న బండారి రాజు రానున్నారు. ఈ మేరకు మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచితం.. దూరం

ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న రమేశ్ గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుడిగా ఉన్నాడు. ఆయన ఇంట్లో ఫ్రిజ్, కూలర్, రెండు ఫ్యాన్లు, టీవీ, లైట్లు ఉన్నాయి. కొంత కాలంగా జీరో బిల్లు వస్తుండగా మార్చి, ఏప్రిల్ నెలల్లో కూలర్ వినియోగం పెరిగింది. దీంతో మీటర్ రీడింగ్ 208 యూనిట్లుగా నమోదవడంతో పథకానికి దూరమయ్యాడు. ఫలితంగా రూ.వెయ్యికి పైగా బిల్లు వచ్చిందని చెబుతున్నాడు. గతంలో150 యూనిట్లు దాటపోయేదని అంటున్నాడు. ఇతనొక్కడే కాదు.. వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడంతో చాలామంది ఈ పథకానికి దూరమవుతున్నారు.



- 'గృహజ్యోతి'పై భానుడి ఎఫెక్ట్
- పెరిగిన విద్యుత్ వినియోగం
- పరిమితి దాటుతున్న యూనిట్లు
- జిల్లాలో ఆరువేల మంది పథకానికి దూరం

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు ఉచిత విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతిపై భానుడి ప్రభావం పడింది. రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు విద్యుత్ వినియోగం పెరిగి మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. పరిమితికి మించి వినియోగం అవుతుండడంతో పలువురు గృహజ్యోతి లబ్ధికి దూరమయ్యారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి మాత్రమే ఈ పథకం వర్తింపజేస్తుండగా, వేలాది మంది అంతకుమించి వినియోగించడంతో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో వారికి అదనపు భారంగా మారుతుంది. మార్చి నుంచి ఎండల ప్రభావం ఉండడంతో వినియోగదారులు ఈ పథకం నుంచి ఒక్కొక్కరు దూరమవుతూ బిల్లులు కట్టాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

భానుడి ప్రభావం..

జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నుంచే పగటి ఉష్ణోగ్రతలు పెరగగా, మార్చిలోనే 35 డిగ్రీల మార్కు దాటింది. ఏప్రిల్, మే నెలల్లో 40 నుంచి 45డిగ్రీలవరకు పెరిగాయి. దీంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. కూలర్లు, ఫ్రిజ్‌ల వినియోగం పెరిగింది. ఫలితంగా విద్యుత్ మీటర్ రీడింగ్ 200 యూనిట్లు దాటుతోంది. అలాగే పిల్లలకు వేసవి సెలవులు ఉండడంతో టీవీలకే అతుక్కుపోతున్నారు. ఈ ప్రభావం కూడా గృహజ్యోతిపై పడినట్లుగా తెలుస్తోంది. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, బల్బులు, ఫ్యాన్లు ఉంటే సాధారణంగా 100 నుంచి 150 వరకు యూనిట్లు అవుతుంది. మార్చి నుంచి ఈ వినియోగం పెరిగింది. 150నుంచి 200లకు పెరగగా, ఏప్రిల్, మే నెలలో 200లకు పైగా రీడింగ్ నమోదవుతుంది. జిల్లాలో రెండు నెలలుగా వేలాది మంది వినియోగదారులు ఈ పథకానికి దూరమయ్యారు. 200 యూనిట్లు దాటిన వారికి వెయ్యికి పైగా బిల్లులు వస్తున్నాయని చెబుతున్నారు. ఈ కేటగిరీలో యూనిట్ ధర సాధారణంగా 1 నుంచి 50 యూనిట్ల వరకు రూ.1.95, 51 నుంచి 100 వరకు రూ.3.10, 101 నుంచి 200 యూనిట్ల వరకు రూ.4.80, 200 యూనిట్లు దాటితే రూ.5.10 చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 200 యూనిట్లు దాటిన వారికి రూ.వెయ్యికి పైగా బిల్లులు వస్తున్నాయి.

జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి కనెక్షన్లు

కేటగిరీ	కనెక్షన్లు
1	2,17,974
2	26,843
3	1261
4	24
5	34,190
6ఏ	2,437
6బి	1,473
7	1984
8	16
9	3

6వేల మందికి చేకూరని లబ్ధి..

వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లాలో 2,86,205 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరి-1కు సంబంధించి గృహ వినియోగం పరిధిలోకి వస్తుంది. ఇందులో 2,17,974 కనెక్షన్లు ఉండగా, గృహజ్యోతికి సంబంధించి 97,072 మందికి ఇది వరకు వర్తించింది. ఈ నెలలో 200 యూనిట్లలోపు వినియోగించిన 92,840 మందికి మాత్రమే పథకం వర్తించింది. ఆపై యూనిట్లు పెరిగిన వారు ఈ పథకానికి దూరమయ్యారు. అయితే డిసెంబర్ 2024లో 98,489 మందికి ఈ పథకం వర్తించగా, జనవరిలో 99,113 మందికి, ఫిబ్రవరిలో 99,284 మందికి, మార్చిలో 99,072 మందికి, ఏప్రిల్‌లో 92,840 మందికి వర్తించింది. ఇందుకు గాను ఇప్పటివరకు రూ.44 కోట్ల 55లక్షల 22వేల 361 ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. అయితే ఎండల తీవ్రత కారణంగా జిల్లాలో 6వేల మందికి పైగా లబ్ధిదారులకు ఏప్రిల్ నెలలో ఈ పథకం వర్తించకుండా పోయింది. నిర్దేశిత యూనిట్లు దాటిన వారికి నెలకు రూ.వెయ్యి నుంచి రూ.1300 వరకు బిల్లు వస్తుంది. ఈలెక్కన దాదాపు రూ.78లక్షల బిల్లులు వినియోగదారులు చెల్లించాల్సి ఉంది.

200 యూనిట్లు దాటితే వర్తించదు

200 యూనిట్లు దాటిన వినియోగదారులకు గృహజ్యోతి పథకం వర్తించదు. ఎండల తీవ్రత కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. ఫ్యాన్లు, కూలర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరగడంతో యూనిట్లు పెరుగుతున్నాయి. జిల్లాలో ఇదివరకు 99,072 మందికి గృహజ్యోతి పథకం వర్తించగా, ఏప్రిల్ నెలకు సంబంధించి 92,800 మంది వినియోగదారులకు వర్తించింది.

– జేఆర్ చౌహాన్, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఆదిలాబాద్

'ఇందిరమ్మ'కు ఆర్థికసాయం

- ఎస్‌హెచ్‌జీల ద్వారా రుణం
- జిల్లాలో 133 మంది లబ్ధిదారుల ఎంపిక

కైలాస్‌నగర్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతంపై యంత్రాంగం దృష్టి సారించింది. ఇంటిని నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేనటువంటి వారు సైతం నిర్మాణాలు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అలాంటి వారికి బ్యాంకు లింకేజీ కింద ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారు. జిల్లాలోని 16 మండలాల పరిధిలో 289 మంది స్వయం సహాయక సంఘాలసభ్యులు బెస్‌మెంట్ స్థాయివరకు నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్థికసాయం కోసం విజ్ఞప్తి చేశారు. ఆయా సంఘాల వివరాలను పరిశీలించిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అందులో 133 మందికి రూ.50వేల చొప్పున బ్యాంకు లింకేజీ కింద రుణమందించాలని నిర్ణయించారు. రూ.66లక్షల 87వేల 500లను మే,జూన్ నెలల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రాథోడ్ రవీందర్ తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించుకోవాలని ఆయన సూచించారు. కాగా ఈ నిర్ణయంపై లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

ట్రాక్టర్ల కొను'గోల్‌మాల్'



మున్సిపల్ ట్యాంకర్ వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ ఇంజన్లు

- షోరూం ధర కంటే అధికంగా చెల్లింపు
- చక్రం తిప్పిన ఓ బల్దియా అధికారి?
- ట్రాలీలు లేకుండానే అడ్వాన్స్‌గా బిల్లుల చెల్లింపు
- ఆదిలాబాద్ బల్దియాలోని పరిస్థితి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ట్రాక్టర్ల కొనుగోలుమాల్ చోటుచేసుకుంది. వాటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు బల్దియా అధికారులు బహిరంగ మార్కెట్ కంటే అధిక ధర చెల్లించడం ఇందుకు బలాన్ని చేకూరుస్తుంది. ఏదైన పనిచేసిన కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించేందుకు నెలల తరబడి తిప్పుకునే అధికారులు ట్రాక్టర్లను సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు మాత్రం ట్రాలీలు అందించకుండానే అడ్వాన్స్‌గా బిల్లులు పూర్తిగా చెల్లించడం అనుమానాలకు తావిస్తోంది. బల్దియాలోని ఓ కీలక అధికారి వెనుకుండి ఈ వ్యవహారాన్ని నడిపించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని పలు వార్డుల నుంచి చెత్త సేకరణ కోసం మూడు కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేయాలని బల్దియా అధికారులు నిర్ణయించారు. వాటి సరఫరా కోసం గతేడాది డిసెంబర్‌లో టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆదిలాబాద్‌కు చెందిన ఇద్దరు టెండర్లు దాఖలుచేశారు.ఇందులో చింతామణి ఏజెన్సీకి చెందిన కాంట్రాక్టర్‌కు టెండర్ కట్టబెట్టారు. సదరు కాంట్రాక్టర్ సోనాలిక కంపెనీకి చెందిన డిఐ35ఆర్‌ఎక్స్ 40హెచ్‌పీ సామర్థ్యంతో కూడిన మూడు ట్రాక్టర్లను ఈ ఏడాది జనవరిలో మున్సిపాలిటీకి అప్పగించారు. కేవలం ఇంజన్లను మాత్రమే అందించారు. చెత్తసేకరణలో కీలకమైన ట్రాలీలను సరఫరా చేయకపోవడంతో మూడు నెలలుగా బల్దియా కార్యాలయ సమీపంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో వృథాగా దర్శనమిస్తున్నాయి.

షోరూం కంటే అధిక ధరకు ...

సోనాలిక కంపెనీ ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీతో కలిపి షోరూం ధర రూ.9లక్షలుగా ఉంది. ఓ రైతు సంబంధిత ట్రాక్టర్ కొనుగోలు చేసేందుకు వెళ్లగా షోరూం ప్రతినిధులు ఆ ధరతో ట్రాక్టర్ డెలివరీ చేసేందుకు కొటేషన్ అందించారు. ఇందులో డీఐ 35 ఆర్ఎక్స్-హెచ్‌పీ 40 సామర్థ్యంతో కూడిన ఇంజన్‌తో పాటు టెంపరరీ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కలిపి రూ.6,70,000, ట్రాలీకి రూ.2,30,000కి గా అందులో పేర్కొన్నారు. బేరమాడితే ఇందులో నుంచి రూ.50వేలు తగ్గించే అవకాశమున్నట్లు షోరూం ప్రతినిధులు సదరు రైతుకు వెల్లడించారు. ఇదిలా ఉంటే బల్దియా అధికారులు కేవలం ఒక్కో ట్రాక్టర్ ఇంజన్‌కే రూ.8.70లక్షల చొప్పున మూడింటికి కలిపి రూ.26,10,000లను సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. జీఎస్టీతో కలిపి రూ.31,10,598లను బిల్లుగా అందజేశారు. వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్‌ను బల్దియా నుంచే చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ట్రాలీ అందజేస్తే దానికి అదనంగా మరో సుమారు రూ.2.30లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈలెక్కన ఒక్కో ట్రాక్టర్‌కు రూ.11లక్షలను చెల్లించాల్సి వస్తోంది. ఇన్సూరెన్స్‌తో కలిపితే ఆ నిధులు మరింత అధికమయ్యే అవకాశముంది. కంపెనీ షోరూం ధరతో పోల్చితే ఒక్కో ట్రాక్టర్‌కు సుమారు రూ.2.20లక్షలు అధికంగా చెల్లించినట్లెందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. నిబంధనల ప్రకారం టెండర్ దాఖలు చేసే కాంట్రాక్టర్ మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు ఇస్తేనే తీసుకోవాల్సి ఉంటుంది. పైగా పలు కంపెనీలకు సంబంధించిన ధరలను పరిశీలించాకే టెండర్‌లో వాటి ధరను నమోదు చేసి టెండర్ దాఖలు చేయాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఓ రైతుకు ట్రాక్టర్ ట్రాలీతో కలిపి షోరూం నుంచి ఇచ్చిన కొటేషన్

బినామీగా.. ఆ అధికారి?

నిబంధనలకు విరుద్ధంగా సాగిన ఈ కొనుగోల్‌మాల్‌లో బల్దియాకు సంబంధించిన ఓ అధికారి చక్రం తిప్పినట్లుగా ఆరోపణలున్నాయి. సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీ పేరిట సదరు అధికారే బినామీగా టెండర్ దాఖలు చేసి ఈ వ్యవహారాన్ని నడిపించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే షోరూం కంటే అధిక ధరకు వాటిని కొనుగోలు చేయడంతో పాటు ట్రాలీలు సరఫరా చేయకుండానే అడ్వాన్స్‌గా కాంట్రాక్టర్‌కు బిల్లులు పూర్తిగా చెల్లించారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలకు అనుగుణంగానే ..

ట్రాక్టర్ల కొనుగోలు కోసం నిబంధనల ప్రకారమే టెండర్ల ప్రక్రియ నిర్వహించాం. తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కే వాటి సరఫరా బాధ్యతలు అప్పగించాం. ఇంజన్లు మాత్రమే సరఫరా చేశారు. ట్రాలీలు రెండు మూడు రోజుల్లో రానున్నాయి. బహిరంగ మార్కెట్ ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేశారనే దాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

– సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

విజయ సిందూరం

• భారత సేనల ఆపరేషన్‌పై హర్షాతిరేకాలు • పహల్గాం ఉగ్రదాడికి సరైన సమాధానమని అభిప్రాయం

ఆదిలాబాద్/బోథ్: అది కశ్మీర్లోని పహల్గాం బైసారన్ వ్యాలీ. మినీ స్విట్జర్లాండ్‌గా పిలిచే పర్యాటక ప్రదేశంలో టూరిస్టుల తాకిడి ఎక్కువ. అయితే ఏప్రిల్ 22న ఆ పచ్చనిప్రాంతం ఎరుపెక్కింది. ప్రకృతిలో సేదతీరుతున్న పర్యాటకులతో ఉత్సాహంగా నిండిన ఆ ప్రాంతం ఒక్కసారిగా హాహాకారాలతో నిండిపోయింది. మనిషి ముసుగులో ముష్కరులు మారణ హోమం సృష్టించారు. మతాన్ని అడిగి మరీ రాక్షసత్వంతో మహిళల సింధూరాలను చెరిపేశారు. భార్యల ముందే వారి భర్తలను కిరాతకంగా కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడిని దేశం అంతా ముక్తకంఠంతో ఖండించింది. ఈ దాడికి ప్రతీకారం తీర్చుకోవాలని నినదించింది. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరుస్తూ ఏప్రిల్ 7న భారత సేనలు అర్ధరాత్రి సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్,పాక్‌లోని 9 ముష్కర స్థావరాలపై మెరుపు దాడి చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరిట ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ఈ ఆపరేషన్ విజయవంతం అవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. జిల్లాకు చెందిన మాజీ సైనికులు మరోసారి బార్డర్‌కు వెళ్లేందుకు సిద్ధమంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన పలువురి అభిప్రాయాలు..




పక్కా ప్రణాళికతో ప్రతీకారం



ఆపరేషన్ సిందూర్ ఎంతో పకడ్బందీగా చేపట్టారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పక్కా ప్రణాళికతో చేసిన మెరుపు దాడి ఇది. ఇప్పటివరకు జరిగింది ట్రైలర్ మాత్రమే అసలు సినిమా ముందుంది. నేను ఉద్యోగ విధుల్లో ఉన్నప్పుడు చిన్నపాటి సంఘటనలు జరిగాయి. అయితే ఇన్ని సన్నాహాలు ఎప్పుడూ చూడలేదు. కార్గిల్ తర్వాత మొదటిసారి చూస్తున్నాను. యుద్ధం వచ్చినా ధీటుగా ఎదుర్కొనేందుకు మన సైన్యం సమర్థంగా ఉంది. దేశ సరిహద్దు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– నారాయణ, మాజీ సైనిక ఉద్యోగి, ఆర్టీలరీ రెజిమెంట్, ఆదిలాబాద్

యుద్ధానికి సిద్ధం



18 ఏళ్ల పాటు సైనికుడిగా ఆర్మీలో విధులు నిర్వహించాను. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారు. ప్రతిగా భారత ఆర్మీ ఆపరేషన్ సింధూర్‌తో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలపై దాడులు నిర్వహించడం గర్వంగా ఉంది. ఒకవేళ యుద్ధమే వస్తే మాజీ సైనికుడిగా అందులో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నా. ఇండియన్ ఆర్మీలో పని చేయడం గర్వంగా ఫీలవుతున్నా. దేశానికి హానిచేసే ఉగ్రవాదులను వదిలిపెట్టవద్దు.

– రాసం ప్రవీణ్ కుమార్, మాజీ సైనికుడు, బోథ్

పహల్గాం బాధితులకు సిందూర్‌తో నివాళి



జాతీయ జెండాలతో నినదిస్తున్న సమితి సభ్యులు

ఆదిలాబాద్: పహల్గాం బాధితులకు ఆపరేషన్ సిందూర్ ఘన నివాళి అందించింది అని సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంపై సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు ఇస్తూ టపాసులు కాల్చారు. ఇందులో శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతిస్వామి, సమితి సభ్యులు కె.రవీందర్, ఆర్. రవీందర్, వేణు, సత్యం, నర్సింలు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, అశోక్‌రెడ్డి, దేవన్న, ఎల్వి రావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు ఎప్పుడూ సిద్ధమే..



అమాయకులైన పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదుల స్థావరాలను తుద ముట్టించడమే లక్ష్యంగా భారత సేనలు ముందుకు వెళ్లడం గొప్ప విషయం. ఆ దేశ పౌరులకు ఎలాంటి హాని చేయకుండా సైనిక క్యాంపులకు ఎలాంటి నష్టం కలిగించకుండా కేవలం ఉగ్రవాద శిక్షణ శిబిరాలే లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయింది. భారత సైన్యంలో 21ఏళ్ల పాటు పని చేసిన అనుభవం ఉంది. దేశభద్రత బాధ్యతలు చేపట్టడంలో ఎప్పుడైనా సిద్ధంగానే ఉంటా. ఈ విషయమై ఇండియన్ ఆర్మీకి రిక్వెస్ట్ లెటర్ సైతం పంపించాను.

– గద్దం అశోక్, మాజీ సైనిక ఉద్యోగి, మద్రాస్ ఇంజినీర్స్ రెజిమెంట్, ఆదిలాబాద్

ఉగ్రవాదులను మట్టుబెట్టాల్సిందే

దేశ ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను మట్టుబెట్టాల్సిందే. పహల్గాంలో పర్యాటకులపై దాడులు చేసిన వారిని వదిలిపెట్టొద్దు. పాక్ ఆక్రమిత భూభాగంలోగల ఉగ్రవాదులపై భారత ఆర్మీ చేసిన దాడులు సరైనవే. నేను 17ఏళ్ల పాటు ఆర్మీలో విధులు నిర్వహించాను. యుద్ధం వస్తే మళ్లీ చేరేందుకు సిద్ధంగా ఉన్నా.

– మల్లెపూల మహేందర్, మాజీ సైనికుడు, బోథ్

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

ఆదిలాబాద్‌టౌన్‌: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు రూ.4వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ అఖిల్‌ మహా జన్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ పట్టణంలోని బంగారు గూడకు చెందిన షేక్‌అస్లమ్‌, కోకటి విజ య్‌ తమ మిత్రుడైన న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఇందూర్‌ గజానంద్‌ హెచ్‌ఎఫ్‌ డిల క్స్‌ బైక్‌ చోరీ చేయాలనే కుట్రతో ఆదిలాబాద్‌ నుంచి జైనథ్‌ వైపు తీసుకెళ్లారు. కత్తితో గొంతు కోసి జైనథ్‌ శివారులోని వైఆర్‌కే కన్‌స్ట్రక్షన్‌ వద్ద పడేసి బైక్‌తో పరారయ్యారు. అప్పటి జైనథ్‌ ఎస్సై కేసు నమోదు చేసి నిందితులను విచారించి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. డ్యూటీ అధికారి జమీర్‌ 25 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ మేకల మధుకర్‌, రహీమ్‌ నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

రెబ్బెన: బాలికను ప్రేమపేరుతో పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి శారీరకంగా వాడుకున్న నిందితుడికి పోక్సో కేసు కింద పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 60వేల జరిమానా విధిస్తూ బుధవారం ఆసిఫాబాద్‌ జిల్లా ప్రిన్సిపల్‌ అండ్‌ సెషన్స్‌ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి తెలిపిన వివరాల మేరకు రెబ్బెన మండలం గోలేటికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన చునార్కర్‌ మహేందర్‌ అనే వివాహితుడు పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో 2019 ఆగస్టు 15న పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై దీకొండ రమేశ్‌ కేసు నమోదు చేయగా డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి నిందుతుడిని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామ సమీపంలో ఆటో, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఎస్‌కే.లతీఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్‌(జి) మండలంలోని బామ్ని(బి) గ్రామానికి చెందిన లతీఫ్‌ పని నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై కుంటాలకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అంబకంటి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌సీసీ విస్తరణకు కృషి



గౌరవ వందనం స్వీకరిస్తున్న సునీల్‌ అబ్రహాం

ఆదిలాబాద్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఎన్‌సీసీ విస్తరణకు కృషి చేస్తున్నామని ఎన్‌సీసీ నిజామాబాద్‌ గ్రూప్‌ కమాండర్‌ సునీల్‌ అబ్రహం అన్నారు. జిల్లా కేంద్రంలోని 32 టీ బెటాలియన్‌ ఎన్‌సీసీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్‌కు మరో బెటాలియన్‌ మంజూరైందన్నారు. ఈ 38వ బెటాలియన్‌ ఏర్పాటైతే రిక్రూట్‌మెంట్‌ పెరుగుతుందన్నారు. ఆసిఫాబాద్‌ గ్రామీణ ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో బెటాలియన్‌ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కమాండింగ్‌ అధికారి వికాస్‌ శర్మ, ఎన్‌సీసీ అధికారులు గాలి అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చంపేస్తోంది..!

ఉమ్మడి జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వం పరిమిత సాయం అందిస్తుండగా, దాతలు మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతోనే బాధితులు జీవనం సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2 వేల మందికి పైగా తలసేమియా బాధితులు ఉన్నప్పటికీ, ఖచ్చితమైన గణాంకాలు వైద్య ఆరోగ్య శాఖ వద్ద లేవు. ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– మంచిర్యాలటౌన్‌

- రక్తం ఎక్కించకపోతే ప్రాణాలకే ముప్పు
- బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పునర్జన్మ
- ఆరోగ్యశ్రీ ద్వారా అంతంత మాత్రంగానే సాయం
- ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న వ్యాధి
- నేడు ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం



మంచిర్యాల రెడ్‌క్రాస్‌ బ్లడ్‌బ్యాంకులో రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా వ్యాధిగ్రస్తులు (ఫైల్‌)

తలసేమియా వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే వ్యాధి. ఇది ఆల్ఫా మరియు బీటా అనే రెండు రకాలుగా విభజించబడింది, మైనర్‌, ఇంటర్మీడియెట్‌, మేజర్‌ అనే మూడు దశల్లో కనిపిస్తుంది.

మైనర్‌ తలసేమియా: ఒక ఆల్ఫా లేదా బీటా చెంజ్‌ తగ్గినప్పుడు సంభవిస్తుంది. ఈ దశలో రక్త మార్పిడి అవసరం లేదు, కానీ వ్యాధి తీవ్రత లేకపోయినా ఇది తదుపరి తరానికి సంక్రమిస్తుంది.

ఇంటర్మీడియెట్‌ మరియు మేజర్‌: హిమోగ్లోబిన్‌ (హెచ్‌బీ) స్థాయిలు తగ్గడంతో ప్రతి 15 రోజులకోసారి రక్త మార్పిడి అవసరం. ఒక యూనిట్‌ రక్తం ఎక్కించడం ద్వారా హెచ్‌బీ స్థాయి ఒక గ్రాము పెరుగుతుంది. హెచ్‌బీ స్థాయి కనీసం 10.5 గ్రాముల వరకు నిర్వహించాలి.

అండగా రెడ్‌క్రాస్‌..

మంచిర్యాల ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్‌ సొసైటీ బ్లడ్‌ బ్యాంక్‌ తలసేమియా బాధితులకు అత్యాధునిక సేవలు అందిస్తోంది.

హెచ్‌బీ ఏ2 పరీక్ష: వ్యాధి నిర్ధారణకు అవసరమైన హెచ్‌పీసీఎల్‌ మిషన్‌ అందుబాటులో ఉంది.

ఐరన్‌ చిల్లేషన్‌ మెడిసిన్‌: 15 యూనిట్ల రక్త మార్పిడి తర్వాత శరీరంలో పేరుకుపోయిన ఐరన్‌ను తగ్గించే మందులు అందిస్తున్నారు. సింగరేణి సంస్థ సహకారంతో సీబీఆర్‌ఎం మిషన్‌ సెలైన్‌ బాక్స్‌ అందుబాటులో ఉంది.

హెచ్‌పీఎల్‌పీ పరికరం: ఉట్నూరు మరియు మంచిర్యాలలో రక్త క్షీణతను గుర్తించే సాంకేతికత అందుబాటులో ఉంది. ఐరన్‌ స్థాయిలు పెరగడం వల్ల తలసేమియా బాధితుల జీవనకాలం 30 ఏళ్ల వరకు పరిమితమవుతోంది. సీరం అబార్ట్‌ ఐ 1000 ఎస్‌ఆర్‌ మిషన్‌ సింగరేణి సహకారంతో మంచిర్యాల రెడ్‌క్రాస్‌లో బాధితులకు ఉపయోగపడుతోంది.

ఆరోగ్యశ్రీ పరిమితులు

ఆరోగ్యశ్రీ ద్వారా నెలకు రూ.15 వేలు మాత్రమే మందుల కొనుగోలుకు అందుతోంది. రోజుకు 3–4 ఇంజెక్షన్లు (ఒక్కో ఇంజెక్షన్‌ రూ.300 వరకు) అవసరమవుతున్నాయి. ఈ ఖర్చును ఆరోగ్యశ్రీలో చేర్చితే నిరుపేదలకు ఊరట లభిస్తుంది.

వ్యాధి లక్షణాలు

తలసేమియా వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. మైనర్‌, ఇంటర్మీడియెట్‌, మేజర్‌ మూడు దశల్లో ఉంటుంది. తలసేమియా ఆల్ఫా, బీటా రెండు రకాలు. ఒక ఆల్ఫా చెంజ్‌ కానీ, ఒక బీటా చెంజ్‌ తగ్గినప్పుడు మైనర్‌ వ్యాధి ఉన్నట్లు. వీళ్లు వ్యాధిగ్రస్తులైనప్పటికీ రక్త మార్పిడి అవసరం లేదు. వీరు వ్యాధి తీవ్రతతో బాధపడరు. కానీ వారి నుంచి వారి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుంది. ఇంటర్మీడియెట్‌, మేజర్‌లో హిమోగ్లోబిన్‌(హెచ్‌బీ) తగ్గిన వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రోగి శరీరంలో ఒక యూనిట్‌ రక్తం ఎక్కిస్తే ఒక గ్రాము హెచ్‌బీ పెరుగుతుంది. హిమోగ్లోబిన్‌ మెయింటనెన్స్‌ కనీసం 10.5 గ్రాములు శాతం ఉండేటట్లు చూసుకోవాలి. ప్రతీ 15 రోజులకోసారి వీరికి రక్తం అవసరం. జ్వరం రావడం, ఆకలి తగ్గడం, కామెర్లు, మూత్రం పసుపు రంగులో రావడం, ఇన్‌ఫెక్షన్‌ జరగడం, మనిషి ఎదుగుదల నిలిచిపోతుంది. హిమోగ్లోబిన్‌ తగ్గడంతో ఎముకల సాంద్రత తగ్గి ఎముకలు విరిగే అవకాశాలు ఉంటాయి. వ్యాధిగ్రస్తుల ఐరన్‌ సంబంధిత మందులు, ఆహార పదార్థాలు, వంటపాత్రలు వాడరాదు. కాల్షియం(ఎముకలను బలపరిచే) పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌

తలసేమియా బాధితులకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ శాశ్వత పరిష్కారం. సంకల్ప్‌ ఇండియా ఫౌండేషన్‌ సహకారంతో గత ఏడాది జిల్లాకు చెందిన ఆరుగురికి ఈ చికిత్స అందించారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు అయింది. కేంద్ర ప్రభుత్వం పీఎం సహాయ నిధి ద్వారా రూ.3 లక్షలు, బాధితులు రూ.2 లక్షల వరకు, మిగిలిన ఖర్చును సంకల్ప్‌ ఫౌండేషన్‌ భరించింది. 90% బాధితులు నిరుపేదలే కావడంతో, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ చికిత్సను అందిస్తే వ్యాధిని నిర్మూలించే అవకాశం ఉంది.

ప్రభుత్వ సాయం..

ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రమే తలసేమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇతర ప్రాంతాల్లో వ్యాధిగ్రస్తుల గణాంకాలు అందుబాటులో లేవు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రి మరియు ఆదిలాబాద్‌ రిమ్స్‌లో ఉచిత రక్త మార్పిడి సౌకర్యం ఉన్నప్పటికీ, ఇతర సేవలు అందించడంలో లోపాలున్నాయి.

ప్రభుత్వమే ఆదుకోవాలి



తలసేమియా వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పెళ్లికి ముందు హెచ్‌బీఏ 2 రక్తపరీక్షను చట్టబద్ధం చేయాలి. ఏజెన్సీ ప్రాంతంలోనే కాకుండా అన్ని ప్రాంతాల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలి. ఆరోగ్యశ్రీద్వారా మందులతో పాటు, ఇంజక్షన్లు ఇవ్వాలి. యూడీఐడీ కార్డులు ఇవ్వాలి. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ప్రభుత్వమే చేయించాలి.

– కాసర్ల రంజిత్‌ కుమార్‌, తలసేమియా వెల్ఫేర్‌ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



విత్తనాలు, నిందితులతో అధికారులు

పెంచికల్‌పేట్‌: పెంచికల్‌పేట్‌ పెద్దవాగు వద్ద బుధవారం 4 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ రాణాప్రతాప్‌ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా బెల్లంపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుబ్బారావు, పాలమరి సురేష్‌, రాచకొండ నగేశ్‌, ఇనుముల రవి రెండు కార్లలో తరలిస్తూ పట్టుబడ్డారు. విత్తనాల విలువ రూ.12 లక్షలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కార్లను సీజ్‌ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో వెంకటేశ్‌, మధు, రమేశ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తులతో పోస్టు పెట్టిన ముగ్గురి అరెస్ట్‌

ఆదిలాబాద్‌టౌన్‌: సోషల్‌ మీడియాలో కత్తులతో పోస్టు పెట్టిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌ టూటౌన్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని తాటిగూడకు చెందిన రాహుల్‌ జందాడే, క్రాంతినగర్‌కు చెందిన సయ్యద్‌ రిజ్వాన్‌, మహాలక్ష్మివాడకు చెందిన తైవర్‌ ఖాన్‌ కత్తులు పట్టుకుని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా సోషల్‌ మీడియాలో పోస్టులు పెట్ట డంతో కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఆదిలాబాద్‌ సబ్‌ డివిజన్‌ పరిధిలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, యువత కత్తులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా సోషల్‌ మీడియాలో పోస్టులు పెట్టినా, రోడ్లపై పుట్టిన రోజు కార్యక్రమాలు నిర్వహించినా, కత్తుల ప్రదర్శన చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కౌలురైతు ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బక్కన్న

నెన్నెల: వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట వడగళ్ల వానకు దెబ్బతినడంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలాతీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన నిరుపేద కౌలురైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గంగారాం గ్రామానికి చెందిన కడారి బక్కన్న మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ప్రైవేట్‌ వ్యక్తుల వద్ద రూ.2 లక్షల వరకు అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి వరిపైరు నేలకొరిగి వడ్లన్నీ నేలరాలాయి. దీంతో పంట పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని బాధితుని భార్య మమత ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది. ఘటనపై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య



సాయినాథ్‌(ఫైల్‌)

నర్సాపూర్‌(జి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్‌ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బూరుగుపల్లి(జి) అనుబంధ గ్రామమైన సూర్యం తండాకు చెందిన చవాన్‌ సాయినాథ్‌ (28) గతేడాది బొలెరో వాహనాన్ని ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. నెలనెలా కిస్తీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతుండేవాడు. ఆదివారం మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్‌ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కొరకు నిజామాబాద్‌ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య చవాన్‌ సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ..

లోకేశ్వరం: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్‌ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కన్కపూర్‌ గ్రామానికి చెందిన చిన్నవాయి సాయన్న (67)నిత్యం మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. బుధవారం మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో పశువుల పాకలోని రేకుల షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమార్కులను పట్టిస్తే రూ.10 వేల పారితోషికం

శ్రీరాంపూర్‌: సింగరేణిలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని పట్టిస్తే వారికి రూ.10 వేల పారితోషికం అందిస్తామని యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల కంపెనీలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు, దళారుల ప్రమేయంపై కఠిన చర్యల్లో భాగంగా ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కంపెనీలో మెడికల్‌ అన్‌ఫిట్‌ చేయిస్తామని, బదిలీలు చేయిస్తామని, ఉద్యోగాలు పెట్టిస్తామని కొందరు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొంది. ఇటీవల ఓ ఉద్యోగి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి డబ్బులు వసూలు చేసి ఏసీబీ చిక్కిన విషయాన్ని గుర్తు చేసింది. అమాయక ఉద్యోగులను మోసం చేస్తే ఉపేక్షించబోమని, అవినీతి వ్యవహారాలు చేసే వారు ఎవరైనా కఠిన చర్యలు ఉంటాయంది. పైరవీలు చేయిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగినా, అవినీతి వ్యవహారాలు చేసినా వారి సమాచారాన్ని కంపెనీ విజిలెన్సు లేదా ఏసీబీ అధికారులకు ఇవ్వాలని సూచించింది. ఇలాంటి వారికి పారితోషకం ఇవ్వడంతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

రుణాల మంజూరులో మంచిర్యాలకు అవార్డు

పాతమంచిర్యాల: బ్యాంకు లింకేజీలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎస్‌.కిషన్‌ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 7,982 గ్రామైక్య సంఘాలకు రూ.430 కోట్ల 28 లక్షలు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా 5,245 సంఘాలకు రూ.464 కోట్ల రుణాలు మంజూరు చేసి లక్ష్యాన్ని అధిగమించింది. దీంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పురస్కారానికి ఎంపిక చేశారు. దీంతో నేడు గురువారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో డీఆర్డీవో ఎస్‌.కిషన్‌, అడిషనల్‌ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత అవార్డు అందుకోనున్నారు. కాగా మంచిర్యాల జిల్లా మూడేళ్లుగా వరుసగా 2022లో ద్వితీయస్థానం, 2023లో తృతీయస్థానంలో నిలిచింది. తాజాగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో కూడా నాలుగోస్థానంలో నిలవడంతో సెర్ప్‌ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

జైనథ్‌: ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం భోరజ్‌ మండలంలోని గిమ్మ గ్రామం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గిమ్మ గ్రామానికి చెందిన అద్దంకి సుభాష్‌ తన ఆటోలో నలుగురు ప్రయాణికులను ఎక్కించుకుని ఆస్పత్రికి వెళ్తుండగా ఆదిలాబాద్‌ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. జైనథ్‌ ఎస్సై స్వామి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు నిందితుల రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని మహాలక్ష్మివాడలో గతనెల 28, 29 తేదీల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డి తెలిపారు. టూటౌన్‌ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌కు చెందిన షేక్‌ మోబిన్‌, వాడే ఆకాష్‌, షిండే ఆకాష్‌ ఆదిలాబాద్‌ మహాలక్ష్మివాడలోని మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. మరోసారి చోరీకి పాల్పడేందుకు బుధవారం జిల్లా కేంద్రానికి రాగా నిందితులను విచారించడంతో సెల్‌ఫోన్‌, రూ.20వేల నగదు, 9 తులాల బంగారం, 280 గ్రాముల వెండి అపహరించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం, 2 తులాల బంగారం, 80 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. సమావేశంలో టూటౌ న్‌ సీఐ కరుణాకర్‌రావు, సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌, టూటౌన్‌ ఎస్సై విష్ణుప్రకాష్‌ పాల్గొన్నారు.

జనావాసాల్లోకి నీలుగాయి



జనావాసాల్లోకి వచ్చిన నీలుగాయి

ఖానాపూర్‌: పట్టణంలోని పద్మావతి నగర్‌, విద్యానగర్‌, అర్బాత్‌ కాలనీల్లో బుధవారం నీలుగాయి సంచరించింది. దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన నీలుగాయిని ఊర కుక్కలు వెంబడించడంతో స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌ఎస్‌వో రవీందర్‌, ఎఫ్‌బీవో నరేందర్‌, బేస్‌ క్యాంప్‌ సిబ్బంది నీలుగాయిని బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు.

ముగ్గురు బైక్‌ దొంగల అరెస్ట్‌



బైక్‌లు, నిందితులతో డీసీపీ, ఏసీపీ

జన్నారం: జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలని బైక్‌ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ ఎగ్గిడి భాస్కర్‌ తెలిపారు. బుధవారం పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్‌ మండలం పోతారం గ్రామానికి చెందిన కంచర్ల నరేశ్‌ మార్చి 5న మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ఉడిపి హోటల్‌ ఎదుట తన ఫ్యాషన్‌ ప్రో బైక్‌ను ఉంచి లోనికి వెళ్లాడు. బయటకు వచ్చి చూసే సరికి బైక్‌ కనిపించకపోవడంతో 8న పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఎస్సై రాజవర్ధన్‌ వాహనాలు తనిఖీ చేస్తుండగా దస్తురాబాద్‌ మండలం మల్లాపూర్‌కు చెందిన బత్తుల పరమేశ్‌, రెంకల నరేశ్‌ బైక్‌లపై అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. జన్నారం మండలం మురిమడుగుకు చెందిన సంపంగి రమేశ్‌, కలమడుగుకు చెందిన లావుడ్యా హరికృష్ణ , దస్తురాబాద్‌ మండలం మల్లాపూర్‌కు చెందిన కొట్టె బానేశ్‌లతో కలిసి ముఠాగా ఏర్పడి మంచిర్యాల, జగిత్యాల, బెల్లంపల్లి, జన్నారం ప్రాంతాల్లో 12 బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్దనుంచి ఫ్యాషన్‌ప్రో బైక్‌లు 5, హోండాషైన్‌ బైక్‌లు–2, స్పెండర్‌ ప్లస్‌ బైక్‌లు–2, ఫ్యాషన్‌ ప్లస్‌, హెచ్‌ఎఫ్‌ డీలక్స్‌, టీవీఎస్‌ స్టార్‌ స్పోర్ట్స్‌ బైక్‌లు ఒక్కొక్కటి స్వాధీనం చేసుకున్నారు. బత్తుల పరమేశ్‌, రెంకల నరేశ్‌, లావుడ్యా హరికృష్ణను అరెస్ట్‌ చేయగా కొట్టె బానేశ్‌ పరారీలో ఉన్నాడు. కాగా సంపంగి రమేశ్‌ వేరే కేసులో జైలులో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌, లక్సెట్టిపేట సీఐ నరేందర్‌, ఎస్సై రాజవర్ధన్‌, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్‌: మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌ మైదానంలో గత నెల 30న నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్‌ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌ తెలిపారు. ఎంపికైన వారిలో శివాని (పెంచికల్‌పేట్‌), ఆత్రం ధనలక్ష్మి (మర్లవాయి), ప్రవీణ్‌ (బెజ్జూర్‌) ఉన్నారు.ఈనెల 9 నుంచి 11 వరకు తమిళనాడులోని ఆరని, తిరువన్నమళై పట్టణాల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను బుధవారం అభినందించారు.

9,10 తేదీల్లో వాలీబాల్‌ పోటీలు

రామకృష్ణాపూర్‌: ఈ నెల 9, 10 తేదీల్లో రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్‌ స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాస్థాయి వాలీబాల్‌ పోటీలు నిర్వహించనున్నట్లు క్యాతనపల్లి మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, పట్టణ ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా నుంచి 20 టీమ్‌లు పాల్గొంటాయని, విజేతలకు ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలతో పాటు ట్రోఫీలను అందజేయనున్నారు.